WWW.NETIDARSHINI.COM
# నేటి దర్శిని
తెలుగు దిన పత్రిక
NETI DARSHINI TV TELANGANA

రంగారెడ్డి, నల్గొండ | సంపుటి : 01 | సంచిక : 02 | శనివారం 16 - 11 - 2024 | ఎడిటర్ : కట్ట సత్యనారాయణ | పేజీలు : 4 | వెల : 3

## ప్రేమికుల మధ్య కిస్సెస్, హగ్స్ నేరం కాదు



నేటి దర్శిని డెస్క్ : యువ జంటల మధ్య చుంబనాలు, ఆలింగనాలు సహజమేనని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ చర్యలను సెక్షన్ 354 ఏ(1) కింద నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. లైంగికంగా వేధించాలనే ఉద్దేశంతో చేపట్టే చర్యలకే ఈ సెక్షన్ వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు 2

## వచ్చే రోజులన్నీ బీజేపీవే

### రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి చురకలు



**- రేవంత్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు...**

నేటి దర్శిని, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చురకలు అంటించారు. పేద ప్రజలకు అన్యాయం చేయొద్దని అంటే బుల్డోజర్‌లతో తొక్కిస్తా అంటావా.. తొక్కించు మేము కూడా చూస్తామని సవాల్ విసిరారు. ఇవాళ(శుక్రవారం) బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... "సిస్టం మీకు మాత్రమే ఉందా.. మాకు లేదా.. చట్టం లేదా" అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామని ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. రేవంత్ ఇలా మాట్లాడితే పేదల కోసం తాము చావడానికి కూడా సిద్ధమని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు. వారి కోసం తమ పదవులు త్యాగం చేసేందుకు తాము రెడీగా ఉన్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.


"మా ఎమ్మెల్యే , ఎంపీ పదవులు వదులుకునేందుకు రెడీ. రేపు(శనివారం) రాత్రి బీజేపీ అధ్వర్యంలో మూసీ బాధితుల ఇంట్లోనే ఉంటాం, అక్కడే పడుకుంటాం. మా పార్టీ ఎంపీలు , ఎమ్మెల్యేలు మూసీ , హైడ్రా బాధితుల ఇళ్లలో ఉండాలని నిర్ణయించాం. 2

## 17, 18 తేదీల్లో గ్రూప్ -3 పరీక్షలు




నేటి దర్శిని, హైదరాబాద్ : ఈ నెల 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. గ్రూప్-3 పరీక్షల నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా 1401 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 2

## ప్రాణ త్యాగానికైనా సిద్ధం



నేటి దర్శిని, న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం తాను ప్రాణ త్యాగానికి కూడా సిద్ధమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నదుర్బార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో 2

## గాడిద పాల కుంభకోణం

- ఏపీ,తెలంగాణలో రూ.100 కోట్లకుపైగా ముంచేసిన కేటుగాడు
- డాంకీ ప్యాలెస్ ఫ్రాంచైజీలో సభ్యత్వం పేరుతో జనాలకు టోపీ
- ఏపీ,తెలంగాణ,కర్ణాటక, తమిళనాడులో వందలాది బాధితులు



నేటి దర్శిని, హైదరాబాద్ : మార్కెట్‌లో గాడిద పాలకు మంచి డిమాండ్ ఉందనే ప్రచారాన్ని నమ్మి.. కొందరు ఆశపడి చివరకు మోసపోయారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలో గాడిద పాల వ్యాపారం పేరుతో వందలాది మందిని బురిడీ కొట్టించి.. రూ.100 కోట్లకుపైగా కాజేశాడు కేటుగాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.. తమనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా ముక్కుడల్‌లో డాంకీ ప్యాలెస్ పేరుతో ఫామ్ మొదలుపెట్టిన నిందితుడు బాబు ఉలగనాథన్.. తన ఫామ్ దగ్గర యూ ట్యూబ్‌లో వీడియోలు తీస్తూ.. లీటరు గాడిద పాలను రూ.1600 నుంచి రూ.1800కు కొనుగోలు చేస్తానని ప్రచారం చేశాడు. భారీగా ఆర్డర్లు వస్తున్నాయని.. కానీ డిమాండ్ తగ్గ సరఫరా చేయలేకపోతున్నానని, ఎవరైనా తనకు గాడిద సప్లై చేస్తే తీసుకుంటానని.. నెలకు రూ. లక్షన్నర వరకు ఆదాయం వస్తుందని ఊదర గొట్టాడు. యూ ట్యూబ్ ఛానల్ వీడియోలతో చాలామంది నిజమని నమ్మి.. లక్షల్లో అతడికి సమర్పించుకున్నారు. తన దగ్గర మేలుజాతి గాడిదలు ఉన్నాయని, వాటి పాల వ్యాపారంతో మంచి లాభాలు వస్తాయని బుట్టలో వేసుకున్నాడు. ఏకంగా విల్లుపురంలో డాంకీ సెమినార్లు కూడా నిర్వహించారు.. దీంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడుకు చెందిన రైతులు అతడి వలలో చిక్కారు. ఒక్కో గాడిదకు కనీస ధర రూ.90 వేలు నుంచి రూ.లక్షన్నర వరకూ వసూలు చేశాడు.గాడిదల నుంచి తీసిన పాలు గంటకు మించి నిల్వ ఉండవని, వాటిని భద్రపరిచేం దుకు హై కెపాసిటీ ఫ్రీజర్లు ఉండాలని అదనంగా రూ.75వేల నుంచి రూ. లక్షన్నర కొట్టేశాడు. వాటిని తిరునల్వేలి నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి అక్కడి నుంచి అందరికీ పంపించాడు.

**తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలో గాడిద పాల వ్యాపారం పేరుతో వందలాది మందిని బురిడీ కొట్టించి.. రూ.100 కోట్లకుపైగా కాజేశాడు కేటుగాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.**

## లాహోర్‌లో తీవ్రంగా కాలుష్యం



### ఆస్పత్రిపాలైన 15 వేల మంది..!

నేటి దర్శిని డెస్క్ : పొరుగు దేశం పాకిస్థాన్‌లోని లాహోర్ నగరంలో కాలుష్యం అత్యంత తీవ్రమైంది. లాహోర్ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా 2

## ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల పాత్ర ఎంతో కీలకం

- "నేటి దర్శిని" తెలుగు దినపత్రికను ఆవిష్కరించిన ఎల్బీనగర్ డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్
- ప్రజాస్వామ్య పరిరక్షణకు నేటి దర్శిని తెలుగు దినపత్రిక అధిక ప్రాధాన్యత
- నేటి దర్శిని ఎడిటర్ కట్ట సత్యనారాయణ



హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి నవంబర్ 15(నేటి దర్శిని): ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎల్బీనగర్ జోన్ డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయంలో నేటి దర్శిని తెలుగు దినపత్రికను ఎడిటర్ కట్ట సత్యనారాయణతో కలిసి డీసీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..... నేటి ఆధునిక యుగంలో పత్రికారంగం కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ గ్రామీణ స్థాయిలో ప్రజలకు అనేక అంశాలపై అవగాహన పూర్తిస్థాయిలో రాకపోవడం నిరుత్సాహకరాంశమేనన్నారు. గ్రామస్థాయిలో నేటి యువతరం ముందుకు వచ్చి విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, సమాజం పట్ల పౌరుల బాధ్యత ఇతరత్రా అంశాల్లో పత్రికలు చేస్తున్నటువంటి కృషికి యువతరం తోడ్పాటున అందిస్తే ప్రజా అభివృద్ధి సాధ్యమేనని 2

## పార్లమెంట్‌లో బిల్లును చించేసిన మహిళా ఎంపీ



2

# ప్రేమికుల మధ్య కిస్సెస్, హగ్స్ నేరం కాదు

**మొదటిపేజీ తరువాయి**

న్యాయస్థానం.. ఓ యువకుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టేసింది. కోర్టు డాక్యుమెంట్ల ప్రకారం, సదరు యువకుడు 2020 నుంచి 19 ఏళ్ల యువతితో రిలేషన్‌షిప్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో ఓ రోజు అతడు యువతిని ఓ చోటకు రమ్మని పిలిచాడు. అక్కడ వారిద్దరూ చాలా సేపు గడిపారు. అనంతరం, అర్ధరాత్రి సమయంలో యువకుడు ఆమెను ముద్దాడి, కౌగిలించుకున్నాడు. ఆ తరువాత యువతి ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తనను పెళ్లి చేసుకోవాలని యువకుడిని కోరింది. దీన్ని తిరస్కరించిన యువకుడు ఆమెకు దూరమయ్యేందుకు ప్రయత్నిస్తుండటంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్ ఆనంద్ వెంకటేశ్.. యువకుడి చర్యలకు సెక్షన్ 354 ఏ(1)(%ఱ%) వర్తించదని అన్నారు. ప్రేమికుల మధ్య ఆలింగనాలు, చుంబనాలు సహజమేనని, ఈ కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు అనుమతిస్తే చట్టాన్ని దుర్వినియోగపరిచినట్టేనని తీర్పు వెలువరించారు.

# వచ్చే రోజులన్నీ బీజేపీవే

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తే మేము మూడు నెలలు అక్కడే ఉండేందుకు సిద్ధం. వచ్చే రోజులన్నీ బీజేపీవే. రాబోయే రోజుల్లో మీమే అధికారంలోకి రాబోతున్నం. కేటీఆర్ అరెస్ట్ అంటూ కాంగ్రెస్ డ్రామా ఆడుతుంది" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

– రేవంత్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు...

"రేవంత్ రెడ్డి తెలంగాణలో ఏం చేశారో చెప్పి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలి. నువ్వు సీఎం అయ్యాక చేసింది ఏంటంటే రెచ్చగొట్టే ప్రసంగాలు , విద్వేష పూరిత వ్యాఖ్యలు తప్ప ఏం ఉంది. మాజీ సీఎం కేసీఆర్ తిట్టినా తిట్ల పురాణాన్ని రేవంత్ రెడ్డి , కేటీఆర్‌లకు అందించినట్లు ఉంది. కేసీఆర్ , రేవంత్ రెడ్డిలు నిరుద్యోగులకు ఏం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఫెయిల్ అయ్యారు. ఏ మొహం పెట్టుకుని మహారాష్ట్ర రైతులకు హామీ ఇస్తున్నారు. కౌలు రైతులు , రైతు కూలీల హామీలు ఏమయ్యాయి. 11నెలల్లో ఎంతమందికి రుణామాఫీ చేశారు. పోలీసులు గతంలో ఫామ్‌హౌస్‌ల కోసం పని చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కోసం పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.మజ్లిస్ ఆదేశాలకు తలొగ్గి రాహుల్ గాంధీ ద్వారా అసదుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ నగర కమిషనర్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక్కడ ఇవన్నీ చాలవన్నట్లు మహారాష్ట్ర ప్రచారానికి రేవంత్ వెళ్తున్నారు. కలెక్టర్ల మీద దాడులు, రైతుల మీద కేసులు తప్పా రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేస్తుంది. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేసీఆర్ పుణ్యమా అని రూ. 8లక్షల కోట్లు అప్పు ఏర్పడింది. కేసీఆర్ , రేవంత్ రెడ్డి వైఖరీ ఓటు బ్యాంకు రాజకీయం చుట్టూ తిరుగుతుంది" అని కిషన్ రెడ్డి విమర్శించారు.

# ప్రాణ త్యాగానికైనా సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. తన చేతిలో రెడ్ బుక్ (రాజ్యాంగ ప్రతి) ఉండటాన్ని అర్బన్ నక్సలిజం అంటూ బీజేపీ నేతలు చేస్తోన్న వ్యాఖ్యలపై ఆయన ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని ఒక్కసారి కూడా చదవకపోవడంవల్లే రెడ్ బుక్‌లో ఏం లేదని, ఖాళీ అని అంటున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగం భారతదేశ ఆత్మ అనే విషయాన్ని మోదీ గ్రహించాలని సూచించారు. బిర్సా ముండా, మహాత్మా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ తదితర మహనీయుల స్ఫూర్తి రాజ్యాంగంలో ఉందని తెలిపారు. రాజ్యాంగంలో ఏం లేదని అంటే ఆ మహనీయులను అవమానించినట్టేనని అన్నారు. బీజేపీ, ఆరెస్సెస్‌లు ఆదివాసీలను వనవాసీలని పిలుస్తూ గిరిజనులను అవమానిస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. గిరిజనులు అడవికే పరిమితం కావాలనేది బీజేపీ ఆలోచన అని విమర్శించారు. దేశంలో ఆదివాసీలు, దళితులు, బీసీలు ఎంతమంది ఉన్నారో తెలియాలంటే కుల గణన చేపట్టాల్సిందేనని పునరుద్ఘాటించారు. ఆదివాసీలు, దళితులు, బీసీలకు రాజ్యాధికారం ఉండాలనేది తన లక్ష్యమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# పార్లమెంట్‌లో బిల్లును చించేసిన మహిళా ఎంపీ

నేటి దర్శిని డెస్క్ : న్యూజిలాండ్‌కు చెందిన యువ మహిళా ఎంపీ హనా రాహితి కరేరికి మైపి క్లార్క్.. వినూత్న రీతిలో పార్లమెంట్‌లో నిరసన తెలిపారు. 22 ఏళ్ల మైపి క్లార్క్.. మావోరి తెగకు చెందిన మహిళ. అయితే ట్రీటీ ప్రిన్సిపిల్స్ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో ఆమె నిరసన చేపట్టారు. వివాదాస్పద ఆ బిల్లును రెండు ముక్కలుగా చించేశారు. ఆ తర్వాత ఆమె సంప్రదాయ మావోరి నృత్యం చేసింది. ఆ మహిళా ఎంపీతో పాటు మరికొందరు సభ్యులు, ఇంకా గ్యాలరీలో ఉన్న వారు కూడా డ్యాన్స్ చేశారు. ఆ డ్యాన్స్‌కు చెందిన వీడియో వైరల్ అవుతున్నది.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల పాత్ర ఎంతో కీలకం







**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా డీసీపీ వ్యాఖ్యానించారు. ప్రజా చైతన్యానికి నేటి దర్శిని తెలుగు దినపత్రిక అధిక ప్రాధాన్యత ఇచ్చి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రిక తోడ్పాటున అందించాలని డీసీపీ ఆకాంక్షించారు. అనంతరం పత్రిక ఎడిటర్ కట్ట సత్యనారాయణ మాట్లాడుతూ....... నేటి దర్శిని తెలుగు దినపత్రిక ప్రజా చైతన్యం కోసం గ్రామస్థాయి నుండి ప్రజలను చైతన్య పరచడానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. నేటి దర్శిని తెలుగు దినపత్రిక అక్షర శోధనలో ప్రతి అక్షరాన్ని ప్రజా చైతన్యం కోసం నిరంతరం విధులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. నేటి దర్శిని తెలుగు దినపత్రికను ఆవిష్కరించిన డీసీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్ ను పత్రికా ఎడిటర్ కట్ట సత్యనారాయణ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రిక ఎడిటర్ శ్రీరాములు, జర్నలిస్ట్ బిక్షం గౌడ్, బీ.జే.పీ నాయకులు శశిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లాహోర్‌లో తీవ్రంగా కాలుష్యం

**మొదటిపేజీ తరువాయి**

కాలుష్య నగరంగా మారింది. నగరం అంతటా నల్లటి విషపు పొగలు వ్యాపించాయి. దాంతో అక్కడ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 1900 దాటింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. నగరానికి చెందిన సుమారు 15 వేల మంది రోగులు ఉబ్బసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఇతర శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరారు. లాహోర్‌లోని ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో ప్రభుత్వానికి ఆరోగ్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. కాలుష్యంపై తక్షణ చర్యలు తీసుకోకుంటే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. కాలుష్యానికి సంబంధించిన ప్రధాన కారణాలను గుర్తించి వాటిని పూర్తిగా నియంత్రించాలని సూచిస్తున్నారు. ప్రజా రవాణాను ఉపయోగించేలా ప్రజలను ప్రోత్సహించాలని, ప్రైవేట్ వాహనాల సంఖ్యను తగ్గించాలని చెబుతున్నారు. లాహోర్‌లోని పలు ఆస్పత్రులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పొడి దగ్గు, న్యుమోనియా, తీవ్రమైన గుండె జబ్బులతో బాధపడు తున్న రోగులతో కిక్కిరిసి ఉన్నాయి. మాయో ఆస్పత్రిలో నాలుగు వేల మందికిపైగా రోగులు, జిన్నా ఆస్పత్రిలో 3,500 మందికిపైగా రోగులు, గంగారామ్ ఆస్పత్రిలో మూడు వేల మందికి పైగా రోగులు, చిల్డ్రన్స్ ఆస్పత్రి లో రెండు వేల మందికి పైగా రోగులు చేరారు. ఈ ప్రమాదకర వాతావరణ ంలో తీవ్రమైన గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# 17, 18 తేదీల్లో గ్రూప్ -3 పరీక్షలు

**మొదటిపేజీ తరువాయి**

టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. మొత్తంగా 5.36 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. గ్రూప్ - 3లో మొత్తం మూడు పేపర్లున్నాయి. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో, తిరిగి సోమవారం ఉదయం సెషన్‌లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీఎస్ పేపర్, మధ్యాహ్నం సెషన్‌లో హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ పేపర్లకు పరీక్షను నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం సెషన్‌లో ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పేపర్‌కు పరీక్షను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# రైతులకు బెయిల్ వచ్చేవరకు పోరాడుతాం



నేటి దర్శిని, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తమతో తలపడాలని, తమ మీద కోపంతో పేదలను కష్టపెట్టవద్దని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హితవు పలికారు. లగచర్ల రైతులు, పేదల ఉసురు తగిలి వారి కన్నీళ్ల సుడిగుండలో రేవంత్ సర్కార్ కొట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. రేవంత్ సర్కారు ఉండేది ఐదేండ్లు మాత్రమేనని, ఢిల్లీకి కోపం వస్తే రేపో, ఎల్లుండో అది కూడా పోతుందని ఎద్దేవా చేశారు. రైతులు, బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న రేవంత్‌రెడ్డిని ఏమి చేయాలో తమకు తెలుసని, తాము వచ్చాక వదిలిపెట్టబోమని హెచ్చరించారు. లగచర్ల ఘటనలో అరెస్టయి జైలులో ఉన్న రైతుల వెంట కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. 21 మంది తరఫున న్యాయపోరాటం చేస్తామని, బెయిల్ వచ్చే వరకు వారి వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, సొంత నియోజకవర్గ రైతులు, ప్రజలు కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా మర్లబడ్డారని, రేపు తెలంగాణ మొత్తం రేవంత్ సర్కార్‌పై మర్లబడతదని హెచ్చరించారు. కొడంగల్, న్యాల్‌కల్ ఎక్కడైనా ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే అక్కడి రైతులకు అండగా బీఆర్‌ఎస్ పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కందిలోని సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న లగచర్ల గ్రామానికి చెందిన 16 మందిని మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జాన్సన్‌నాయక్‌తో కలిసి కేటీఆర్ పరామర్శించారు. జైలులో ఉన్న 16 మంది రైతులతో నాలుగు విడతలుగా నలుగురు చొప్పున రైతులతో ఆయన ములాఖత్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

– బీఆర్‌ఎస్ వారిపైనే కేసులు

కేసీఆర్ సేకరించిన 14వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుండా రియల్ ఎస్టేట్ దందా చేస్తానని, అన్నలు, తమ్ముళ్లకు భూముల సంతర్పణ చేస్తానని, ఫార్మా విలేజ్‌ల పేరిట సంగారెడ్డి జిల్లా న్యాలకల్, కొడంగల్‌తోపాటు 20 ఫార్మావిలేజ్‌లు పెడతామంటూ రేవంత్ వికృత పోకడలకు పోతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. లగచర్ల ఘటనలో రేవంత్ సర్కార్ కాంగ్రెస్ వాళ్లను తప్పించి బీఆర్‌ఎస్ వారిపైనే అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రూ. 60 నుంచి రూ. 70 లక్షలు పలికే లగచర్ల భూములను అడ్డికిపావుశేరుకు లాక్కుంటామని చెప్తుండడంతోనే రైతులు, ఆడబిడ్డలు 9 నెలలుగా ఆందోళన చేస్తున్నారని వివరించారు. లగచర్లలో 70 మందిని అరెస్ట్ చేశారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన రమేశ్, నర్సింహులు, రాములు నాయక్ తదితరులు కూడా నిరసనలో పాల్గొన్నారని తెలిపారు. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి రాజకీయ ఒత్తిడితో కాంగ్రెస్ వారిపై కేసులు లేకుండా చేశారని, దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ ఇందుకు సహకరించారని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్‌కు చెందిన 21 మందిని మాత్రమే రిమాండ్ చేసి, కాంగ్రెస్ వారిని వదిలేశారని ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. వారి కాళ్లు, చేతులు కమిలిపోయి ఉండడాన్ని ములాఖత్‌లో తాను గమనించానని తెలిపారు.

WWW.NETIDARSHINI.COM
నేటి దర్శిని
తెలుగు దిన పత్రిక

## శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప, ఆంజనేయ స్వాములకు దుప్పట్ల పంపిణీ



గుర్రంపోడు:నవంబర్ 15(నేటి దర్శిని) కంబాల శివలీల ఫౌండేషన్ చైర్మన్ శివలీల ఆధ్వర్యంలో శుక్రవారం కనగల్లు మండల కేంద్రంలోని వారి నివాసంలో పిల్లుట్ల ప్రసాద్-రాధ దంపతుల సహకారంతో ఏర్పాటు చేయబడిన దుప్పట్లను అయ్యప్ప,ఆంజనేయ,శివ స్వాములకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ..చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అయ్యప్ప,ఆంజనేయ,శివ స్వాములకు దుప్పట్లను పంపిణీ చేశామని ప్రతి ఒక్కరూ చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అయ్యప్ప,ఆంజనేయ,శివ స్వాములకు సహకరించాలన్నారు. స్వాములకు సహకరించినందుకు పిలుట్ల ప్రసాద్– రాధ దంపతులను కంబాల శివలీల అభినందించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య, స్వాములు లింగయ్య,శంకర్,గుంటోజు చారి, జిల్లేపల్లి పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



గుర్రంపోడు:నవంబర్ 15(నేటి దర్శిని) గుర్రంపోడు మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాల్లో కార్తీక దీపారాధన నిర్వహించారు. గుర్రంపోడులోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో,కొప్పోలు గ్రామంలోని శ్రీ పార్వతీ బుగ్గ రామలింగేశ్వర దేవాలయంలో వేద పండితులు అన్నేపర్తి శివాజీ శర్మ,మోపూరి కిరణ్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయాల్లో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. శివాలయంలోని శివలింగానికి రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద పంపిణీ చేశారు.

## నల్లగొండ జిల్లాలో దొంగతనాల ముఠా గుట్టురట్టు

**- గుర్రంపోడు మండలం ఎరెడ్లగూడెం దొంగతనం కేసును చేదించిన పోలీసులు**

**- ఆమలూరు బస్సు స్టేజి వద్ద నిందితుల అరెస్టు: బంగారు ఆభరణాలు, నగదు రికవరీ**

**- ఎరెడ్లగూడెం కేసు నిందితుల అరెస్టుతో 3 కేసులు పరిష్కారం**

**- సీఐ ధనుంజయ్, ఎస్.ఐ మధు నీ అభినందించిన నల్లగొండ ఎస్పీ**




గుర్రంపోడు,నవంబర్15(నేటిదర్శిని): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ఎరెడ్లగూడెం గ్రామంలో ఈనెల 9వ తేదీన దొంగతనం చేసిన నిందితులను శుక్రవారం నాడు సీఐ ధనుంజయ, ఎస్సై మధు, ఆమలూరు స్టేజి వద్ద బస్సు దిగి పారిపోతుంటే వారిని పట్టుకున్నారని శుక్రవారం నాడు మీడియా సమావేశంలో దేవరకొండ డిఎస్పి గిరిబాబు తెలిపారు, నేరస్తులను విచారించగా ఎర్రడ్లగూడెం గ్రామంలో చేసిన నేరంతో పాటు మూడు నెలల క్రితం నాంపల్లి మండలం నేరేళ్లపల్లి గ్రామంలో బంగారు పుస్తెలతాడు, కొండమల్లేపల్లి గ్రామంలో మాటీలు, దిద్దులు, 50వేల నగదు దొంగతనాలకు పాల్పడినట్టు వారు ఒప్పుకున్నారు, వారి వద్ద నుండి ఎరెడ్లగూడెంలో దొంగతనం చేసిన బంగారు బ్రాస్లెట్, 60 వేల రూపాయలను అమలూరు బస్సు స్టేజి వద్ద రికవరీ చేశారు, నేరస్తులను జోగులాంబ గద్వాల్ జిల్లా కు చెందిన వడ్డే గోపాల్, వడ్డే రామాంజనేయులుగా గుర్తించారు, దొంగతనం చేదించిన సిబ్బంది సీఐ ధనుంజయ, ఎస్సై మధు, హేము నాయక్, భాస్కర్, కావలి నరసింహ, సత్యనారాయణ, శ్రీధర్ రెడ్డిలను, నల్లగొండ ఎస్పీ, దేవరకొండ డిఎస్పి అభినందించారు.

## 12 ఏండ్ల చిన్నారికి గుండెపోటు.. గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి





నేటి దర్శిని, హైదరాబాద్ : ఉపాధి కరువై.. కుటుంబం గడువక మనోవేదనకు గురైన ఓ ఆటో డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం కొరుకొండపల్లికి చెందిన తుమ్మ జనార్దన్ (36) పదేండ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీరికి ఎలాంటి భూమి లేదు. ఇతని భార్య సైతం కూలీ పనులకు వెళ్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ తగ్గింది. ఆర్థిక ఇబ్బందులు నెలకొన్న తరుణంలో కుటుంబ అవసరాలకు, పిల్లల చదువుకు అప్పు చేశాడు. ఆటో పాతది కావడంతో దాని స్థానంలో ఫైనాన్స్‌లో కొత్త ఆటో కోసం శుక్రవారం మహబూబాబాద్‌లోని షోరూంకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. జనార్దన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

గుండెపోటుతో పన్నెండేళ్ల చిన్నారి ప్రాణాలు వదిలింది. ఈ విషాదకర ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకున్నది. చెన్నూర్ పట్టణంలోని పద్మానగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్–రమా దంపతులకు కూతురు నివృత్తి(12), కొడుకు ఉన్నారు. నివృతి చెన్నూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నది. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో పాఠశాలకు సెలవు ఇవ్వడంతో ఇంటి వద్దే ఉన్నది. ఉదయం ఇంట్లో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక దవాఖానకు తరలించారు. వైద్యు లు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. గుండెపోటుతో మృతి చెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు.

## మెగా డీఎస్సీపై అసెంబ్లీలో నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు

నేటి దర్శిని, అమరావతి : మెగా డీఎస్సీపై ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం నారా లోకేశ్ శాసనసభలో మాట్లాడుతూ.. 1994 నుంచి డీఎస్సీల నిర్వహణపై ఆరా తీస్తున్నామని చెప్పారు. అనేక సార్లు కోర్టుల్లో వివాదాలతో ఆలస్యమైన నేపథ్యంలో వాటిని పరిష్కరించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి న్యాయపరమైన సమస్యల్లో చిక్కుకోకుండా వాటన్నింటినీ నిరోధించేలా డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఏపీలో ఎప్పటి నుంచో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని నారా లోకేశ్ తెలిపారు. కానీ గత ఐదేళ్లలో వైసీపీ ఒక్కసారి కూడా డీఎస్సీ నియామకాలు చేపట్టలేదని, ఒక్క టీచర్ ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. హడావుడిగా ఎన్నికల సమయంలో ఫిబ్రవరి 12వ తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. అది కూడా 6100 పోస్టులకే నోటిఫై చేశారని.. ఆ తర్వాత దాని ప్రక్రియను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్ని వైసీపీ దారుణంగా మోసం చేసిందని, అలాంటి మోసాలకు తావు లేకుండా నిర్దిష్టమైన ప్రణాళికతో మెగా డీఎస్సీతో ముందుకొస్తామని



తెలిపారు. అలాగే వయసు పరిమితిపై కూడా ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మోడల్ ఎడ్యుకేషన్‌లో ఉపాధ్యాయుల్ని భాగస్వామ్యం చేస్తామని నారా లోకేశ్ తెలిపారు.

# యంగ్ హీరోయిన్స్ కి పోటీ ఇస్తున్న నయనతార.!



నేటి దర్శిని, సినిమా : హీరోయిన్స్ సీనియర్ సెగ్మెంట్‌లోకి అడుగుపెడితే ఇక నెమ్మదిగా ఆఫర్స్ తగ్గిపోతాయి. లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తే అడపాదడపా ఒకటి రెండు ఆఫర్స్ వస్తుంటాయి. కానీ ఈ రూల్ బ్రేక్ చేస్తున్నారు నయనతార. సీనియర్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టిన తరువాత కూడా ఏ మాత్రం జోరు తగ్గకుండా మెయిన్ టైన్ చేస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియాలోనూ జోరు చూపిస్తున్నారు నయన్. నయనతార.. దాదాపు 20 ఏళ్లుగా సౌత్ సిల్వర్ స్క్రీన్‌ను రూల్ చేస్తున్న పేరు. హీరోయిన్‌గా పరిచయం అయిన దగ్గర నుంచి టాప్ స్టార్స్‌తో జోడి కడుతున్న ఈ బ్యూటీ, ప్యారలల్‌గా లేడీ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేస్తూ వస్తున్నారు. ఆమెతో పాటు కెరీర్ స్టార్ట్ చేసిన మిగతా హీరోయిన్లు కెరీర్‌లో స్లో అయినా.. నయన్ మాత్రం ఇప్పటికీ అదే జోరు మెయిన్‌టైన్ చేస్తున్నారు. ప్రజెంట్ సీనియర్ హీరోలకు సరైన జోడీ దొరకటం కష్టంగా ఉంది. ఈ గ్యాప్‌ను పర్ఫెక్ట్‌గా క్యాష్ చేసుకుంటున్న నయన్, సీనియర్ స్టార్స్ సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే ఆ సినిమాల్లోనూ జస్ట్ గ్లామర్ డాల్‌లా కాకుండా పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలకే ఓకే చెబుతున్నారు.

ఓ వైపు కమర్షియల్ సినిమాల్లో నటిస్తూ మరో వైపు లేడీ ఓరియంటెడ్ మూవీస్ కూడా చేస్తున్నారు నయన్. తమిళ్, తెలుగు, హిందీ అన్న తేడా లేకుండా అన్ని భాషలు చుట్టేస్తున్నారు. అందుకే ప్రజెంట్ ఈ బ్యూటీ చేతిలో పది సినిమాలు ఉన్నాయి. తమిళ్‌లో ఏడు, మలయాళంలో రెండు, కన్నడలో ఒక సినిమా సెట్స్ మీద ఉన్నాయి. ఇవి కాక మరో అరడజను సినిమాలు డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నాయి. కుర్ర హీరోయిన్లకు పోటీ ఇవ్వాలంటే గ్లామర్ విషయంలో వెనక్కి తగ్గకూడదని ఫిక్స్ అయిన నయన్, సోషల్ మీడియాలోనూ జోరు చూపిస్తున్నారు. వరుస ఫోటో షూట్స్‌తో రచ్చ చేస్తున్నారు. గ్లామర్ ప్లస్ పెర్ఫామెన్స్‌తో ఇప్పటికీ తాను స్టార్ లీగ్‌లో ఉన్నానంటూ క్లారిటీ ఇస్తున్నారు నయన్.

# సౌత్ ఇండస్ట్రీలో హీరోలను దేవుడి లాగా కొలుస్తారు : రాశీ ఖన్నా



నేటి దర్శిని, సినిమా : దక్షిణాదికి చెందిన నటులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది స్టార్ కథానాయిక రాశి ఖన్నా. సౌత్ ఇండస్ట్రీలో అభిమానులు హీరోలను దేవుడిలాగా కొలుస్తారని ఒ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. రాశీ ఖన్నా బాలీవుడ్‌లో చేస్తున్న తాజా చిత్రం 'ది సబర్మతీ రిపోర్ట్'. 12 ఫెయిల్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న విక్రాంత్ మాస్సే ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గోన్న రాశీ తాజాగా సౌత్ ఇండస్ట్రీ హీరోలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాశీ మాట్లాడుతూ.. హీరోలకు సౌత్‌లో ఉన్నంతా పాపులారిటీ ప్రస్తుతం బాలీవుడ్‌లో లేదు. అక్కడ హీరోలని దేవుడి లాగా కొలుస్తారు అభిమానులు. వారి సినిమాలు విడుదల అయితే పండగా చేసుకుంటారు. ఒకప్పుడు ఇది బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ సినిమాలకు కనిపించేది. కానీ ఇప్పుడు బాలీవుడ్‌లో అలా లేదు. కానీ సౌత్‌లో ప్రతి ఒక్క హీరోకి స్టార్‌డమ్ ఉంటుంది. నేను సౌత్‌లో చేసిన దర్శకులు ఇప్పటికి చెబుతూ ఉంటారు. అక్కడ పెద్ద హీరోల సినిమాలు విడుదల అయితే స్కూల్ బంక్ కొట్టి మరి సినిమాలకు వెళ్ళేవాళ్ళం అని. జస్ట్ వారు అభిమానించే నటుడిని చూడడానికి మాత్రమే సినిమాలకు వెళుతుంటారు. అంత పిచ్చి సినిమాలంటే వాళ్లకి. ఏలాంటి సమస్య అయిన రానీ సినిమా చూడడం మాత్రం ఆపారు. కావాలంటే వేరే పనులను అయిన పెండింగ్ చేస్తారు ఏమో కానీ సినిమాలు చూడడం మాత్రం ఆపారు అంటూ రాశీ ఖన్నా చెప్పుకోచ్చింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# భిన్నధ్రువాల సంఘర్షణ

నేటి దర్శిని, సినిమా : ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మాతలు. శుక్రవారం ఫస్ట్‌గ్లింప్స్‌ను అగ్ర హీరో మహేష్‌బాబు విడుదల చేశారు. ఇందులో ధనుష్‌ను మురికివాడలో జీవితం గడుపుతున్న నిజాయితీపరుడైన వ్యక్తిగా పరిచేయం చేశారు. మరోవైపు అందుకు పూర్తి భిన్నంగా ముంబయిలో కుటుంబంతో కలిసి వుంటున్న రిచెస్ట్ బిజినెస్‌మ్యాన్‌గా నాగార్జున పాత్రను చూపించారు.

ఇక రష్మిక మందన్న సంఘర్షణలతో సతమతమవుతున్న మధ్యతరగతి యువతిగా కనిపించింది. ఈ మూడు పాత్రల్లోని భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ ఆసక్తికరంగా సాగింది. అసలు వీరిమధ్య సంబంధం ఏమిటన్నది ప్రేక్షకుల్లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసేలా ఉంది.

విజువల్స్ ఆకట్టుకున్నాయి. సమకాలీన సమాజంలోని ఆర్థిక అసమానతలు, వాటి తాలూకు పర్యవసానాలను చర్చిస్తూ సందేశాత్మక కథాంశంతో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కించాడని చెబుతున్నారు. శేఖర్ కమ్ముల సహజశైలికి భిన్నంగా సొసైటీలోని సీరియస్ ఇష్యూని ఇతివృత్తంగా ఎంచుకొని ఈ సినిమా తీసినట్లుగా అర్థమవుతున్నది.



# అందంగా నవ్వాలి.. హద్దులు చెరిపేయాలి..



నేటి దర్శిని, సినిమా : 'పుష్ప 2'లో ఐటమ్ సాంగ్‌కి శ్రీలీల 5కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నదని ఫిల్మ్ వర్గాల్లో టాక్. ఆమె డ్యాన్సింగ్ టాలెంట్‌కి అదేం పెద్ద ఎక్కువ కాదని శ్రీలీల అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే.. 'ది వైల్డ్ చైల్డ్' పేరుతో శ్రీలీల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోషూట్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతున్నది. ఇది కేవలం ముఖ హావభావాలకు సంబంధించిన ఫొటోషూట్ కావడం విశేషం. ఈ ఫొటోషూట్‌లో శ్రీలీల తన అందమైన కళ్లను, అంతకంటే అందమైన తన నవ్వునూ ఎలివేట్ చేస్తూ తెగ సందడి చేసింది.

'అందంగా నవ్వాలి.. హద్దులు చెరిపేయాలి.. వాలుగా చూడాలి.. కవ్వింతగా కనుసైగ చేయాలి..' ఇలా కొటేషన్స్ ఇస్తూ.. దానికి తగ్గట్టు క్లోజ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో శ్రీలీల కనిపించిన తీరుకు అభిమానులు ఫిదా అయిపోతున్నారు. ఇక శ్రీలీల సినిమాల విషయానికొస్తే.. ఆమె ఐటమ్ నంబర్ చేసిన 'పుష్ప 2' వచ్చే నెల 5న విడుదల కానుంది. అదే నెల 25న క్రిస్మస్ కానుకగా నితిన్ 'రాబిన్‌హుడ్'తో ప్రేక్షకులను పలకరించనుంది శ్రీలీల. ఇక రవితేజ 'మాస్ జాతర' ఎలాగూ ఉంది. పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో కూడా శ్రీలీలే వన్ ఆఫ్ ది హీరోయిన్. వీటితోపాటు తమిళ్‌లో కూడా ఓ సినిమా చేస్తున్నదని సమాచారం.